మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధితుడిని పరామర్శిస్తున్న దివాకర్ రావు, విజిత్ రావు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 15 : లక్షెట్టిపేట మండలం పాత కొమ్ము గూడెం మాజీ సర్పంచ్ రాగుల రాజేశం అనారోగ్యంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, యువ నాయకుడు నడిపెల్లి విజిత్ రావు దవాఖానకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత వైద్యులకు సూచించారు.

డీఈఈపై చర్యలు తీసుకోవాలి

దండేపల్లి, అక్టోబర్15 : అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న డీఈఈ(ట్రైబల్ వెల్ఫేర్)పై చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడారు. డీఈఈ స్థానికంగా ఉండకుండా హైదరాబాద్, నిర్మల్ వంటి ప్రాంతాల నుంచి రాకపోకలు కొనసాగిసిస్తున్నాడని, ఏజెన్సీ అలవెన్స్‌లు తీసుకుంటూ ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేస్తున్నాడని, కాంట్రాక్టర్ బిల్లులో 5 శాతం తీసుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. ఆయనపై ఉన్నతాధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ జైనొద్దీన్, అసోసియేషన్ నాయకులు ఇమామ్, రామస్వామి, సాదిక్, భూమన్న, మల్లేశ్, అజారుద్దీన్ ఉన్నారు. ఈ విషయమై డీఈఈ(ట్రైబల్ వెల్ఫేర్)శహబాజ్ అహ్మద్‌ను వివరణ కోరగా, సరైన వసతులు లేని కారణంగా ఇక్కడ ఉండలేకపోతున్నానని, పర్సంటేజీల విషయంలో వారి ఆరోపణలు నిరాధారమని, పేపర్ ఖర్చుల నిమిత్తం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సిబ్బంది కొరత కారణంగా సైట్‌కు వెళ్లలేకపోతున్నానని తెలిపారు. గతంలో పలువురు కాంట్రాక్టర్లు తన ఐటీడీఏకు ఫిర్యాదు చేశారని, వివరణ ఇచ్చుకున్నానని పేర్కొన్నారు.

ఊర చెరువు హద్దులపై సర్వే పునఃప్రారంభం

మందమర్రి, అక్టోబర్ 15 : మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి చెరువు హద్దులపై రెవెన్యూ అధికారుల సర్వే మంగళవారం పున:ప్రారంభమైంది. ఉదయం చెరువు వద్దకు వెళ్లిన సర్వే అధికారులు పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ఉదయం ప్రారంభమైన సర్వే సాయంత్రం వరకు కొనసాగింది. చెరువు శిఖం, పరిధి ఎంత అనే విషయాలను తేల్చేపనిలో సాగునీటి పారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు గత నెలలో ఉమ్మడి సమగ్ర సర్వేను ప్రారంభించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడీ శ్రీనివాస్, మండల సర్వే అధికారి కృష్ణ రైతులతో కలసి మంగళవారం చెరువు పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువు శిఖం పరిధిలో ఉన్న భూమి, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ హద్దుల కొలతల పనులను చేపట్టామని వారు తెలిపారు. చెరువు పూర్తి సమగ్ర సర్వే చేపడుతున్నామని సర్వే పూర్తయిన తరువాత రికార్డులను కలెక్టర్, తహసీల్దార్‌కు అందజేస్తామని తెలిపారు. చెరువును ఆనుకుని నిర్మాణాలు ఉండడం వల్ల సర్వేకు ఆటంకం కలుగుతున్నదని, మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశాలున్నాయని వారు చెప్పారు.

స్లేట్ స్కూల్‌లో కూచిపూడి డ్యాన్స్ డే

దండేపల్లి(జన్నారం), అక్టోబర్ 15 : జన్నారం పట్టణంలోని స్లేట్ హైస్కూల్‌లో మంగళవారం కూచిపూడి డ్యాన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది విద్యార్థులు ఒకేసారి డాన్స్ నృత్య ప్రదర్శన చేశారు. స్లేట్ గ్రూప్ ఆఫ్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కూచిపూడి డ్యాన్స్ ప్రతి ఒక్కరు నేర్చుకోవాలని, దీని వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. బొమ్మిడి నరేశ్‌కుమార్, డాన్స్ మాస్టర్ రమేశ్, నర్మదా, సుధా, కృష్ణ, ప్రిన్సిపాల్ షరీన్ ఖాన్, అకాడమీ డైరెక్టర్ రజితారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 15 : జాతీయస్థాయి జూనియర్ అథ్లెట్ పోటీలకు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఆలం శైలజ ఎంపికైనట్లు గిరిజన క్రీడల అధికారి బండ మీన రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో జరిగే 16 నుంచి 19వ తేదీ వరకు పోటీలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. అత్యున్నత టెక్నిక్స్‌తో శిక్షణ అందిస్తున్న అథ్లెటిక్ శిక్షకుడు విద్యాసాగర్, ఆలం శైలజను ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ రమాదేవి, ఏసీఎంవో పీ ఉద్ధవ్, ఏటీడీవో చిరంజీవి, జీసీడీవో శకుంతల, పాఠశాల శిక్షకులు అరవింద్, తిరుమల్ అభినందించారు.

తమ్ముడిపై అన్న దాడి : చికిత్స పొందుతూ మృతి

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 15 : చెన్నూర్ మండలం అక్కెపల్లి గ్రామంలో అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవల తమ్ముడు కొడిపె మల్లయ్య (45) మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెన్నూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిపె మల్లయ్య, భీమయ్య అన్నదమ్ములు. తరచు మద్యం తాగి గొడవ పడుతుండేవారు. మల్లయ్య ఇంటి వద్ద ఉన్న బాత్రూం నీళ్లు భీమయ్యకు చెందిన గడ్డి వాములోకి వస్తున్నాయని ఆదివారం రాత్రి ఇద్దరు గొడవపడ్డారు. భీమయ్య క్షణికావేశంలో మల్లయ్య తలపై కర్రతో బలంగా కొట్టాడు. వెంటనే మల్లయ్యను చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా మారడతంలో కరీంనగర్‌కు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మల్లయ్య మృతి చెందాడు. మల్లయ్య మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ దవాఖాకు తరలించారు. మల్లయ్యకు భార్య విజయ, కూతురు, కొడుకు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట, అక్టోబర్ 15 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న గణితం, రసాయన శాస్త్ర అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీం తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో హావర్లీ బేసిస్ పద్ధతిలో బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 17వ తేదీన 4 గంటల లోగా ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఉపాధి అవకాశాలు పొందాలి

శ్రీరాంపూర్, అక్టోబర్ 15 : యాజమాన్యం కల్పిస్తున్న వృత్తి శిక్షణలు నేర్చుకొని ఉపాధి అవకాశాలు పొందాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి పేర్కొన్నారు. శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టైలరింగ్, మగ్గం వర్క్, బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ డీటీపీ వృత్తి శిక్షణ కోర్సులను ప్రారంభించారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సేవా సమితి కార్యదర్శి కొట్టె జ్యోతి, డీవైజీఎం అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, వృత్తి శిక్షకురాలు పాల్గొన్నారు.

నిర్దేశిత బొగ్గు ఉత్పత్తికి కృషిచేయాలి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 15 : అక్టోబర్‌లో కంపెనీ నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి సూచించారు. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం బొగ్గు ఉత్పత్తిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గత నెల సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్షించారు. ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు శ్రీనివాస్, ఏవీ రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు రాముడు, శ్రీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, మల్లయ్య, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, అన్ని గనుల మేనేజర్లు, రక్షణాధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- వేమనపల్లి మండల కేంద్రంలో పర్యటన

వేమనపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

వేమనపల్లి, అక్టోబర్ 15 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలోని వార్డులు, పరిసరాలను పరిశీలించారు. రోగులను వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. దవాఖానకు వచ్చేవారికి మెరుగైన వైద్యం అందించాలని, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అనంతరం డంప్ యార్డును పరిశీలించి, ఇంటింటా సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత మండల కేంద్రంలోని ప్రైమరీ, దస్నాపూర్‌లోని ఆశ్రమ, నీల్వాయి జడ్పీ పాఠశాలలను సందర్శించారు. దస్నాపూర్ పాఠశాలలో హాజరు శాతం తక్కువగా ఉందని ఉపాధ్యాయులను అడుగగా సెలవుల అనంతరం మంగళవారం పాఠశాల ప్రారంభమైనందున విద్యార్థులు రాలేదని కలెక్టర్‌కు తెలిపారు. ఆ తర్వాత వంటగదిని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలల్లో సమస్యలుంటే సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం వేమనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. వీధి దీపాలు లేవని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట పంచాయతీ కార్యదర్శులు శ్యాం, అశోక్ ఉన్నారు.

పట్టభద్రులు, ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరుగా నమోదు చేసుకోవాలి..

నస్పూర్, అక్టోబర్ 15 : పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అర్హత గల వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఫారం 18, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కోసం ఫారం 19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6వ తేదీ లోగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. డిసెంబర్ 30న తుది జాబితా ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి..

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమాధికారి స్వరూపరాణి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, కిశోరబాలికలు, పిల్లల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలను సొంత భవనాలకు మార్చేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంబందిత అధికారులు పాల్గొన్నారు.

కలాం అందరికీ ఆదర్శం

కోటపల్లి కేజీబీవీలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌వో, విద్యార్థులు

దండేపల్లి : గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో..

కోటపల్లి, అక్టోబర్ 15 : దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శమని కోటపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హరిత అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కేజీబీవీలో మంగళవారం ప్రపంచ విద్యార్థుల దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారంలో..

దండేపల్లి(జన్నారం), అక్టోబర్ 15 : జన్నారంలోని రాఘవేంద్ర విద్యాసంస్థల్లో అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎర్ర సంపత్, డీన హేమలత, రాఘవేంద్ర-కరిమల కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, లిటిల్‌హన్స్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న, సిబ్బంది ఉన్నారు.

మందమర్రిలో..

మందమర్రి, అక్టోబర్ 15 : మందమర్రి పట్టణంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మనోవికాస్ పాఠశాల ఆవరణలో యువజన కాంగ్రెస్ నాయకులు కేక్‌కట్ చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్ కుమార్, నాయకులు సదానందం, వేణు, ఓరుగంటి సురేందర్, మహంత్ కృష్ణ, సాయితేజ, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలి

నిరసనకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్, అక్టోబర్ 15 : లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్‌కు చెందిన న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సమేతంగా చేపట్టిన నిరసన దీక్షకు మంగళవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, కౌన్సిలర్ మిన్‌హాజ్, నాయకులు మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సామగ్రి ధ్వంసం

తరగతి గదిలో విరిగిపడి ఉన్న డెస్కులు, టేబుల్

వాంకిడి, అక్టోబర్ 15 : మండలంలోని బెండార ఎంపీయూపీఎస్ పాఠశాలలోని విలువైన సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఏఎస్ఐ పోశెట్టి తెలిపారు. దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాల గేటు తాళం పగలగొట్టి లోపలికి చొరబడి, ఫర్నిచర్‌తో పాటు, పాఠ్యపుస్తకాలు, కరెంట్ బోర్ తీగ, ట్యాంక్ పైపులైన్లు, నల్లా కనెక్షన్లు, టైల్స్, ఫ్యాన్లను ధ్వంసం చేశారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. మంగళవా రం వాంకిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ ఐ పోశెట్టి అక్కడికి వచ్చి విచారణ చేపట్టారు. ఈ మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు జోడేఘాట్‌లో అవ్వల్ పేన్ పూజ

కెరమెరి, అక్టోబర్ 15 : మండలంలోని జోడేఘాట్‌లో బుధవారం రాత్రి ఆదివాసులు సంప్రదాయబద్ధంగా అవ్వల్‌పేన్ పూజ నిర్వహించనున్నారు. గ్రామానికి రక్షణగా నిలిచే పోచమ్మతల్లిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని, సంప్రదాయ వాయిద్యాలతో భీం వారసులు ప్రత్యేక పూజ చేయనున్నారు. భీం స్మృతి చిహ్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి, నేరుగా అవ్వల్‌పేన్ వద్దకు తరలివెళ్లి, భీం మనుమడు కుమ్రం సోనేరావ్ ఆధ్వర్యంలో ఆదివాసులు సామూహిక పూజలు చేసి, అమ్మవారికి మొక్కులు చెల్లించనున్నారు. అనంతరం అక్కడే వంటలు వండి సహపంక్తి భోజనం చేస్తారు.

విద్యార్థినులకు సన్మానం

తాండూర్, అక్టోబర్ 15 : రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో కాంస్య పతకం సాధించిన అచ్చలాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు కే శ్రీవల్లి, ఈ ఈశ్వరిని ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ మంగళవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడలో 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ రావు, సంబరం శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, సుధాకర్, హరిప్రసాద్, భాస్కర్, రవి, కే శ్రీనివాస్, అంజిరెడ్డి, సురేందర్, సాంబమూర్తి, సంగీతం శ్రీనివాస్, గ్రామ పెద్దలు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చిలకమ్మ, విద్యార్థులు అభినందించారు.

క్యాడర్ ఫిక్సేషన్ బెసిక్ పే అమలు చేయాలి

రెబ్బెన, అక్టోబర్ 15 : ఎన్‌హెచ్ఎంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 78 రకాల కేడర్లలో విధులు నిర్వహిస్తున్నరని, వారందరినీ షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఫిక్సేషన్, బేసిక్ పే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. రెబ్బెన పీహెచ్‌సీలో మంగళవారం డాక్టర్ మోహన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రమీల, పద్మ, సునీత, విజయలక్ష్మి, తులసి, వనిత, శ్రీవిద్య, రుచిత, మృదుల్‌మండల్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 15 : రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు ప్రైవేటు కళాశాలల విద్యార్థులు మంగళవారం పట్టణంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ తీశారు. సాయి తేజ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బీ శ్రీనివాస్, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుక్, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాలను తొలగించాలి

బెజ్జూర్, అక్టోబర్ 15 : మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో ఉన్న కూరగాయల దుకాణాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి తుకారాం యజమానులకు సూచించారు. గతంలోనే దుకాణాలను తొలగించాలని చెప్పామన్నారు. అలాగే నోటీసులు కూడా అందించామని, అయినా తొలగించడంలేదని తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ఏఎస్ఐ మోహన్ నాయక్, యజమానులు పాల్గొన్నారు. కాగా, ఇక్కడ బతుకుదెరువు కోసం చిన్నిచిన్న వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారుల పొట్టకొట్టవద్దని పలువురు యువకులు కోరారు. ఈ మేరకు కార్యదర్శి తుకారంకు వినతి పత్రం అందించారు. బతుకుదెరువు కోసం వారికి ప్రత్యామ్నాయం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో షౌకత్ అలీ ఖాన్, ఇరురపు వెంకటేశ్, గుమ్ముల శ్రీనివాస్, గౌత్రె శంకర్, కుమ్మరి శంకర్, నమీర్ అలీ, దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

సమావేశం

నస్పూర్, అక్టోబరు 15 : జిల్లా కేంద్రంలో మంగళవారం తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు నరసయ్య, శ్రీనివాస్, రమణ మాట్లాడుతూ.. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే వివిధ రూపాల్లో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. వీరికి విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు చంద్రమోహన్, విష్ణువర్ధన్, దుర్గాప్రసాద్, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, సన్నిగౌడ్, తిరుపతి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కాసిపేట, అక్టోబర్ 15 : కాసిపేట మండలంలోని దేవాపూర్ సల్పాలవాగు అటవీ ప్రాంతంలో 27న నిర్వహించే దండారీ దర్బార్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. స్థానిక వెంకటాద్రి ఆలయం వద్ద మంగళవారం దండారీ నిర్వాహకులు సమావేశమయ్యారు. 26న సాయంత్రం దండారీలు సల్పాల వాగు చేరుకొని, 27న కార్యక్రమం నిర్వహించాల్సిందిగా తీర్మాణం చేశారు. అలాగే నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆడ జంగు, గౌరవాధ్యక్షుడిగా రాయి సిడాం రాందాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, ప్రధాన కార్యదర్శిగా సోయం సూరు, కోశాధికారిగా మడావి వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా ఆడ జంగు, మడావి గోపాల్, టేకం రామకృష్ణ, రాయి సిడాం సోము, ప్రచార కార్యదర్శులుగా ఆత్రం జంగు, టేకం భగవంతరావు, ఇతర కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

క్రీడలతో స్నేహభావం

దహెగాం, అక్టోబర్ 15 : క్రీడలతో యువకుల్లో స్నేహభావం పెరుగుతుందని ఎస్ఐ కందూరి రాజు పేర్కొన్నారు. ఖర్జీ గ్రామానికి చెందిన యువకులు నిర్వహించిన క్రికెట్ క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. దహెగాం, కన్నెపల్లి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. మాజీ వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, మాజీ సర్పంచ్‌లు సర్పులు ఎల్కరి సంజీవ్, తుమ్మిడ మల్లేశ్, నాయకలు జర్పుల కృష్ణ, తుమ్మిడ పాపయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ పండుగ

తాండూర్, అక్టోబర్ 15 : ముస్లిం సోదరులు గ్యార్మీ పండుగ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తాండూర్, తంగళ్లపల్లి, ఐబీలో గౌసెపాక్ సందల్ ఊరేగింపు నిర్వహించారు. జామా మసీద్ ఇమామ్ అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దల సమక్షంలో వేడుకలు కోలాహలంగా జరిగాయి. గౌసెపాక్ దర్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మంగళవారం ఉదయం అన్నదానం నిర్వహించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 15 : రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో మంగళవారం ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఏడీసీ శంకర్, ఏడీసీ సేఫ్టీ వార్డెన్ పోచం తదితరులు పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలపై సమీక్షా సమావేశం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 15 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ప్రసూతి మరణాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత వైద్యాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది బెల్లంపల్లి, వేమనపల్లి, నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మాతృ మరణాలపై సంబంధిత అధికారులు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీవోలు క్రుపాబాయి, అరుణశ్రీ, అలివేణి, అసోసియేట్ ప్రొఫెసర్ కృష్ణవేణి, సమత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 15 : మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న దాదాపు 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటో ట్రాలీ వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ లచ్చన్న, తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా, బియ్యం పట్టుబడింది. మంచిర్యాల ఎన్టీఆర్ నగర్‌కు చెందిన సిరిగిరి సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

17న వాల్మీకి జయంతి

నస్పూర్, అక్టోబర్ 15 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో 17న ఉదయం 10 గంటలకు మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, నాయకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఒకరికి రెండేళ్ల జైలు

బెల్లంపల్లి, అక్టోబర్ 15 : దొంగతనం కేసులో కాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సికిందర్‌కు బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముఖేశ్ రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ఇందిరమ్మ కాలనీలో 2022, సెప్టెంబర్ 15న గడ్డం మార్కండేయ తన ఇంటికి తాళం వేసి, బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న వెండి సామగ్రి, ఒక గ్రాము బంగారం, సుమారు రూ.23,500 నగలను దొంగిలించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌హెచ్‌వో ముఖ్కేరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిగాకాగజ్‌నగర్‌కు చెందిన సయ్యద్ సికిందర్‌గా గుర్తించి, కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధించినట్లు వెల్లడించారు.

ఐదుగురి రిమాండ్

తాండూర్, అక్టోబర్ 15 : రాగి వైరు దొంగతనం చేసిన కేసులో కిష్టంపేటకు చెందిన తొడేటి భీమయ్య, తొడేటి వెంకటేశ్, నీలాయిపల్లికి చెందిన ఉరడి రవి, కోయ సురేందర్, ఎడ్ల రాజేశ్‌ను రిమాండ్ చేసినట్లు తాండూర్ ఎస్ఐ డీ కిరణ్‌కుమార్ తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన అర్ధరాత్రి చౌటపల్లి శివారులోని టాటా సోలార్ ప్లాంట్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఫెన్సింగ్ వైర్ కట్ చేసి, లోపలికి చొరబడ్డారు. డీసీ కాపర్ వైర్ దొంగిలించారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ దూడ శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందన్‌పెల్లి ఎఫ్‌ఆర్వోగా శ్రీనివాస్

దండేపల్లి(జన్నారం), అక్టోబర్15 : జన్నారం డివిజన్‌లోని ఇందన్‌పెల్లి ఎఫ్‌ఆర్వోగా శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఇన్‌చార్జి రేంజర్ హాఫీజుద్దీన్ లక్షెట్టిపేటకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్వో మాట్లాడుతూ.. అటవీ పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఎఫ్ఆర్వోకు అటవీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కన్నెపల్లి, అక్టోబరు 15 : భీమిని మండలం వీగాం గ్రామానికి చెందిన గట్టు సాయి ఇంద్రనీలగౌడ్(32) సోమవారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వీగాం మాజీ సర్పంచ్ గట్టు తులసీ రామగౌడ్‌కు ఇద్దరు కొడుకు, ఇద్దరు బిడ్డలు. పెద్ద కొడుకు ఇంద్రనీలగౌడ్ చార్టెడ్ అకౌంటెంట్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత ఏడాది తండ్రి రామగౌడ్ మృతిచెందగా, ఇప్పుడు ఇంటి పెద్ద దిక్కు అయిన ఇంద్రనీల గౌడ్ మృతిచెందడం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. వీగాం గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

మందమర్రి, అక్టోబర్ 15 : మందమర్రి పట్టణంలోని రామన్ కాలనీ సమీపంలో గల ఫ్లై ఓవర్ సమీపంలో జాతీయ రైల్వేలైన్‌పై ప్రవీణ్‌కుమార్(36) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన ప్రవీణ్ కుమార్ దర్జీ పని చేస్తున్నాడు. మానసిక స్థితి సరిగా లేక ఇక్కడకు వచ్చి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

పెంచికల్ పేట్ , అక్టోబర్ 15 : మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన కోట బుచ్చయ్య (53) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపారు. మద్యానికి బానిసైన బుచ్చయ్య అదే మత్తులో గత శుక్రవారం రాత్రి తన పంట చేనులో గడ్డి మందు తాగాడు. అనంతరం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు చెప్పడంతో హుటాహుటిన కాగజ్‌నగర్‌లోని దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడ రెండు రోజులు వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ కేఎంసీ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. భార్య తార ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నిరుపేదలకు సరుకుల పంపిణీ

జైనూర్, అక్టోబర్ 15 : జైనూర్ మండల కేంద్రంలో 144 సెక్షన్ విధించడంతో పాటు, మార్కెట్ బంద్ కారణంగా నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న కరీంనగర్ క్రెడిట్ ఎక్సెస్ ఇండియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని కాలేజీ గూడకు చెందిన 23 కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ చంద్రశేఖర్ వారణాసి, ఏరియా మేనేజర్లు నరేశ్ రెడ్డి, షేక్ జానీ భాష, బ్రాంచ్ మేనేజర్ ప్రమోద్ సూర్య శేఖర్ బుఖ్య, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంట్లో చొరబడ్డ గుర్తుతెలియని వ్యక్తులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 15 : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. మంగళవారం అయన తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి, చేతిలో కత్తులు పట్టుకొని ఎమ్మెల్యే ఇంటి ప్రహరీ దూకి లోపలికి వచ్చారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. వాచ్‌మన్ గమనించి అరుపులు, కేకలు వేయడంతో పారిపోయారు. ఎమ్మెల్యే సంబంధిత వ్యక్తులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ అధికారుల బదిలీ

కౌటాల, అక్టోబర్ 15 : కౌటాల సబ్ డివిజన్ ఏడీఈగా విధులు నిర్వహించిన రాజేశ్వర్ మంగళవారం బదిలీపై ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఎవరూ రాలేదు. అలాగే కౌటాల ఏఏఈ రవీందర్ బదిలీపై తిర్యాణికి వెళ్లారు. ఆయన స్థానంలో కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయ ఏఏఈ ప్రేంకుమార్ బదిలీ అయ్యారు. ఏడీఈ రాజేశ్వర్, ఏఏఈ రవీందర్ మంగళవారం రిలీవ్ అయ్యారు.

బిల్డింగ్‌పై నుంచి పడి ఒకరి మృతి

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 15 : నస్పూర్‌లోని సీసీసీ కార్నర్ మేకల మండి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ బిల్డింగ్‌పై నుంచి కిందపడి మధ్యప్రదేశ్‌కు చెందిన కూలీ నీరజ్ బైసన్(30) మృతిచెందాడని ఎస్ఐ నెల్కి సుగుణాకర్ తెలిపారు. మద్దెల రమేశ్ ఇల్లు నిర్మిస్తున్నాడు. మంగళవారం పనులు చేస్తున్న క్రమంలో నీరజ్ బై సన్ ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పో లీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ప్రమాదం తీరును పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖాకు తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.